# రోమీయులకు వ్రాసిన పత్రిక 13వ అధ్యాయము

**అధికారులకు లోబడియుండుట**

ప్రతివాడునుపై అధికారులకు లోబడియుండవలెను. ఏలయనగా దేవుని వలన కలిగినది తప్ప మరి ఏ అధికారమును లేదు ఉన్న అధికారములు దేవుని వలననే నియమింపబడియున్నవి. 2 కాబట్టి అధికారమును ఎదిరించువాడు దేవుని నియమమును ఎదిరించుచున్నాడు ఎదురించువారు తమమీదికి తామే శిక్ష తెచ్చుకొందురు. 3 ప్రభుత్వము చేయువారు చెడ్డ కార్యములకే గాని మంచి కార్యములకు భయంకరులు కారు. 4 నీకు మేలు కలుగుటకు అధికారులు దేవుని పరిచారకులు. వారికి భయపడక ఉండకోరితివా? మేలు చేయుము, అప్పుడు వారి చేత మెప్పుపొందుదువు. నీవు చెడ్డది చేసినయెడల భయపడుము, వారు ఊరకయే ఖడ్గము ధరింపరు, కీడు చేయువాని మీద ఆగ్రహము చూపుటకై వారు ప్రతికారము చేయు దేవుని పరిచారకులు. 5 కాబట్టి ఆగ్రహ భయమును బట్టి మాత్రము కాక మనస్సాక్షిని బట్టియు లోబడియుండుట ఆవశ్యకము. 6 ఏలయనగా వారు దేవుని సేవకులై యుండియెల్లప్పుడు ఈ సేవయందే పని కలిగియుందురు. 7 ఇందుకే గదా మీరు పన్ను కూడ చెల్లించుచున్నారు? కాబట్టి ఎవనికి పన్నో వానికి పన్నును, ఎవనికి సుంకమో వానికి సుంకమును చెల్లించుడి ఎవని యెడల భయముండవలెనో వాని యెడల భయమును ఎవని యెడల సన్మానముండవలెనో వాని యెడల సన్మానమును కలిగియుండిఅందరికిని వారి వారి ఋణములను తీర్చుడి

**సహోదర ప్రేమ**

8 ఒకని నొకడు ప్రేమించుట విషయములో తప్ప మరేమియు ఎవనికిని అచ్చి యుండవద్దు. పొరుగువానిని ప్రేమించిన వాడే ధర్మశాస్త్రము నెరవేర్చినవాడు. 9 ఏలాగనగా వ్యభిచరింపవద్దు, నరహత్య చేయవద్దు, దొంగిల వద్దు, ఆశింపవద్దు అనునవియు, మరి ఏ ఆజ్ఞయైనను ఉన్న యెడల అదియు, నిన్నువలె నీ పొరుగు వానిని ప్రేమింపవలెనను వాక్యములో సంక్షేపముగా ఇమిడియున్నవి. 10 ప్రేమ పొరుగువానికి కీడు చేయదు గనుక ప్రేమ కలిగి యుండుట ధర్మశాస్త్రమును నెరవేర్చుటయే.

**క్రీస్తు దినము సమీపించుట**

11 మరియు మీరు కాలము నెరిగి నిద్ర మేలు కొను వేళయైనదని తెలిసికొని ఆలాగు చేయుడి మనము విశ్వాసులమైనప్పటికంటె ఇప్పుడు, రక్షణ మనకు మరి సమీపముగా ఉన్నది. 12 రాత్రి చాల గడచి పగలు సమీపముగా ఉన్నది గనుక మనము అంధకార క్రియలను విసర్జించి, తేజస్సంబంధమైన యుద్ధోపకరణములను ధరించుకొందము. 13 అల్లరితో కూడిన ఆటపాటలైనను, మత్తయినను లేకయు, కామ విలాసములైనను, పోకిరి చేష్టలైనను లేకయు కలహమైనను మత్సరమైనను లేకయు, పగటి యందు నడచుకొనునట్టు మర్యాదగా నడచుకొందము. 14 మెట్టుకు ప్రభువైన యేసుక్రీస్తును ధరించుకొనినవారై, శరీరేచ్ఛలను నెరవేర్చుకొనుటకు శరీరము విషయమై ఆలోచన చేసికొనకుడి